క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జియారత్



రుద్రవరంలో ఫాతెహాలు సమర్పిస్తున్న దృశ్యం

చాగలమర్రి: స్థానిక చిన్నమకానం వీధిలో వెలసిన లాల్‌స్వామికి సోమవారం జియారత్ నిర్వహించారు. దీంతో మొహర్రం పూజలు ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. పీర్ల నిమజ్జనం పూర్తయిన మూడో రోజు జియారత్ నిర్వహించడం సంప్రదాయం. ఈ సందర్భంగా నిర్వహించిన ఫాతెహాలకు స్వామిని ఊరేగించి నఖీబులను కమిటీ సభ్యులు సన్మానించా రు. అలాగే ఎలాంటి సంఘటనలు చోటు చేసు కోకుండా భద్రత కల్పించిన ఎస్‌ఐ రమణయ్యను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్, కమిటీ ఉపాధ్యక్షులు చక్రం ముల్లా షబ్బీర్, సంయుక్త కార్యదర్శి ముల్లా ఇబ్రహీం పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రంలో సోమవారం మౌలాలి స్వామి పీరుకు జియారత్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం ముగిసిన మూడవ రోజు జియారత్ నిర్వహించడం ఆనవాయితీ అని చావిడి నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగానే మౌలాలి స్వామి పీరును దట్టీలు,పూల సూచికాలు,వెండి గొడుగులతో అలంకరించారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి పూజల్లో పాల్గొన్నారు.

గోస్పాడు: మండల కేంద్రంలో మౌలాలి స్వామికి జియారత్ పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా స్వామి వారికి జెండాలు, పూల సూచికాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 6వ తేదీన పట్టణంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాల మైదానంలో నంద్యాల జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని నంద్యాల జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 19సంవత్సరాల్లోపు బాలబాలికలకు పోటీలుంటాయని ఆసక్తి గల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2004 ఏప్రిల్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫొటో, ఆధార్‌తో పాటు రూ.20 ప్రవేశ రుసుము చెల్లించి హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ : 9959051059 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మరమ్మతులు పూర్తి చేయండి

నంద్యాల(సెంట్రల్): కేసీ ఆయకట్టుకు కీలకమైన అలగనూరు జలాశయం మరమ్మతు పనులు ప్రారంభించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వై.ఎస్.రెడ్డి కోరారు. ఈ మేరకు సమితి బృందం సోమవారం కేసీ కాలువ ఉప కార్యనిర్వాహక ఇంజినీరు సుబ్రహ్మణ్యం రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపినట్లు గతంలోనే తమకు లేఖ ద్వారా సాగునీటి శాఖాధికారులు తెలియజేశారన్నారు.పరిపాలనా అనుమతులు రాగానే పనులు మొదలు పెడతామని డీఈ హామీ ఇచ్చారన్నారు. ఏరువ రామచంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, కొమ్మా శ్రీహరి, భాస్కర్‌రెడ్డి, శివరామిరెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, సుధాకర్ రావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం):నవనంది రోటరీ క్లబ్ 2023–24 నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం స్థానిక రోటరీ కార్యాలయం గవర్నర్ శ్రీరామ్మూర్తి ప్రమాణ స్వీకారం చేయించా రు. క్లబ్ అధ్యక్షుడిగా దీపక్, కార్యదర్శి రాజేష్, కోశాధికారి దివ్యనాథ్, అలాగే.. ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలిగా మహాలక్ష్మి, కార్యదర్శి అనురాధ, కోశాధికారి చంద్రకళ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఫాస్ట్ గవర్నర్ రామలింగారెడ్డి, చిన్నపురెడ్డి, రత్నమ్మ పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో మంచి ఫలితాలు

గోస్పాడు: రైతులు పంటల సాగుకు ముందు విత్తనశుద్ధి చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం బీటీఎం ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని దీబగుంట్ల రైతు భరోసా కేంద్రంలో సోమవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలను తెచ్చుకొని పంటలు సాగు చేయాలన్నారు. అనంతరం రైతులకు ఎరువుల యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధి చేసే ప్రక్రియపై, భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలు, జీవన ఎరువుల వినియోగం వల్ల వచ్చే ఫలితాలను వివరించారు. ఏటీఎంఏ ఏఓ ప్రభావతమ్మ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోతి దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

రుద్రవరం: స్థానిక దళిత కాలనీకి చెందిన మరియమ్మ అనే మహిళపై సోమవారం వానరం దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కాలనీ వాసులు తెలిపిన వివరాల మేరకు.. మరియమ్మ ఇంట్లో నుంచి బయటకు వెళ్తుండగా ఇంటిపై భాగంలో ఉన్న వానరం ఒక్కసారిగా ఆమె మీదకు దూకి దాడి చేసింది. మెడకు వెనుక భాగాన కరవడంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వివరించారు.

మారిన వ్యవస్థ.. తీరిన అవస్థ

- వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు తొలగిన ఇబ్బందులు
- మరింత చేరువైన ప్రభుత్వ పాలన
- గడప వద్దకే చేరుతున్న సంక్షేమ పథకాలు
- కార్యాలయాల పనులు సైతం చేసిపెడుతున్న వలంటీర్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

నాలుగేళ్ల క్రితం వరకు కూడా ప్రభుత్వ సేవలు పొందాలంటే ప్రజలు అవస్థలు పడేవారు. అయినా తాము నూతన సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకున్న పాలకులకు వారి కష్టాలు కనిపించలేదా అంటే.. పీత కష్టాలు.. అన్న చందంగా వ్యవహరించారు. తమ గురించి పట్టించుకోని వారిని జనం సైతం పక్కన పెట్టేశారు. అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంలో భాగంగా గ్రామ సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా గ్రామ/వార్డు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రజలకు ఇంటి వద్దకే పాలన, పథకాలు అందేలా చేయడంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తూ వారి అవస్థలను తీరుస్తున్నారు.

గోస్పాడు: ప్రజల వద్దకే పాలనకు నిదర్శనంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు నిలిచాయి. పథకాలు, ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువ చేయడంతో ఈ రెండు వ్యవస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా పథకాల వర్తింపులో వలంటీర్ల సేవలు అభినందనలు పొందుతున్నాయి. ప్రతి నెల1వ తేదీన పింఛన్ల పంపిణీ నుంచి ప్రభుత్వం అంజేసే పథకాలు అర్హులకు వర్తించేలా చూస్తున్నారు. అలాగే పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం వాటిలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. మండల ంలో 12 సచివాలయాల ద్వారా 205 మంది వలంటీర్లు 5,445 మంది పింఛన్‌దారులకు ప్రతి నెలా రూ.1.46కోట్లు లబ్ధిదారుల ఇంటికి తిరిగి అందజేస్తున్నారు.





కర్నూలులో చికిత్స పొందుతున్న సుబ్రహ్మణ్యంకు, కరోనా సమయంలో మస్తాన్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్లు సుధాకర్,రామాంజనేయులు

కరోనా సమయంలో సేవలందించారు



కరోనా కష్టకాలంలో మొదట్లో ఎంతో ఇబ్బందులు పడ్డాం. మా వార్డు వలంటీర్ రామాంజనేయులు కష్ట సమయంలో కూడా ఇంటి వద్దకు వచ్చి మాకు రేషన్ కూపన్లను అందజేయడం, వైద్య సహకారం అందేలా చేశాడు. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటే భయపడుతున్న సమయంలో కూడా ప్రభుత్వం నుంచి అందే పథకాలన్నీ ఆపకుండా మాకు అందజేశాడు.

– మస్తాన్, దీబగుంట్ల, గోస్పాడు

ఇబ్బందులు తప్పాయి



వృద్ధాప్యంలో ఉన్న నాకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. గతంలో పింఛన్ సమయానికి ఎక్కడ ఉన్నా..ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. గ్రామానికి వచ్చి రోజుల తరబడి క్యూలో నిలిచి పింఛన్ సొమ్మును తీసుకోవాల్సి వచ్చేది. వలంటీర్లు వచ్చాక మాకు ఆ ఇబ్బందులు తప్పాయి. ఒకసారి అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే తెలుసుకొని అక్కడికి వచ్చి పింఛన్ అందజేశాడు – సుబ్రహ్మణ్యం, ఒంటివెలగల, గోస్పాడు

వలంటీర్లు వచ్చాకే పింఛన్ వస్తుంది



పింఛన్ కోసం గతంలో ఎన్నో మార్లు కార్యాలయాల చుట్టూ తిరిగాను. వలంటీర్లు వచ్చాక..60 సంవత్సరాలకే పింఛన్ వస్తుందని, ఇంటి వద్దకు వచ్చి దరఖాస్తు చేయించారు. దీంతో ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నాకు 18 నెలలుగా పింఛన్ అందుతుంది. ప్రస్తుతం గ్రామంలోని వలంటీర్ నెలనెలా ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. కుల వృత్తి అయిన కుండలు తయారు చేసుకొని జీవనం సాగిస్తుండేవాడిని పింఛన్ సొమ్ము నెలనెలా వస్తుండటంతో మరింత ఆసరాగా ఉంది.

–వెంకటస్వామి, జూలేపల్లె

వలంటీర్ల సేవలు ఎంతో ఉపయోగం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో వలంటీర్లను నియమించి మంచి పని చేశారు. ఏ ప్రభుత్వ పథకమైనా ప్రజలకు వలంటీర్ల ద్వారా తెలుస్తోంది. ఎంతో మంది తెలియని వారికి కూడా వారు ఇంటింటికీ వచ్చి పథకాల గురించి చెబుతుండటంతో అర్హులకు పథకాలు అందుతున్నాయి. గతంలో డప్పు కళాకారుల పింఛన్ కోసం ఎంతగానో ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వలంటీర్ వచ్చి తానే దరఖాస్తు చేసి పింఛన్ మంజూరు చేయించాడు. ప్రస్తుతం డప్పు కళాకారుల పింఛన్ పొందుతున్నా.

– పెద్ద మద్దిలేటి, యాళ్లూరు

కుటుంబ సభ్యుడిలా వలంటీర్



దివ్యాంగ పింఛన్ మా వలంటీర్ నరేంద్ర ద్వారా అందుకుంటున్నా. గతంలో నాకు ఈ పింఛన్ అందేది కాదు. వికలాంగ సర్టిఫికెట్ కోసం ఎన్నో మార్లు అధికారుల చుట్టూ తిరిగినా అందజేయలేదు. అయితే ఏడాదిన్నర క్రితం సదరం క్యాంపు ద్వారా వికలాంగత్వం సర్టిఫికెట్ తీసుకోవచ్చని వలంటీర్ ద్వారా తెలుసుకున్నా. వలంటీర్ సదరం క్యాంపుకు రిజిస్ట్రేషన్ చేయించడంతో సర్టిఫికెట్ వచ్చింది. దాని ఆధారంగా పింఛన్ అందేలా చేశాడు. ప్రస్తుతం ఆయన ప్రతి నెలా ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేస్తున్నాడు. కొంత కాలం కాన్పుకు వెళ్లగా.. అక్కడికి వచ్చి అందజేశాడు. కుటుంబ సభ్యుడిటా వ్యవహరిస్తాడు.

– కుమారి, జూలేపల్లె, గోస్పాడు

అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తాం





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

నంద్యాల(సిటీ): పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని రాజకీయాలకు అతీతంగా, ప్రాముఖ్యత ఆధారంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. అజెండాలోని అన్ని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం కో ఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. గత నెలలో వాయిదా పడిన అంశాలను పొందపరచకుండా ఇతర అంశాలను చేర్చడం సరికాదన్నారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి స్పందిస్తూ పని ఒత్తిడి వల్ల పొరబాటు జరిగిందన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని దుకాణాల లీజుదారుల లీజు గడువు ముగిసినందున లీజు పొడగింపు కోసం 56/2011 జీఓ ప్రకారం నెలసరి అద్దెను నిర్ణయించాలని కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా సబ్‌రిజిస్ట్రార్ వ్యాల్యూలో 10 శాతం, చుట్టుపక్కల ఉన్న అద్దె విలువ, ప్రస్తుతం ఉన్న అద్దె విలువపై 33.33 శాతంగా నిర్ణయించి వీటిలో ఏది ఎక్కువ అయితే దాన్ని లీజు దారుల నుంచి వసూలు చేయనున్నట్లు కౌన్సిల్ తీర్మానించింది. అనంతరం సభ్యులు పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈలు మధుకుమార్, జయభారత్‌రెడ్డి, శానిటరీ అధికారులు పాల్గొన్నారు.

రూ. 6.25 కోట్లతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు

ఉయ్యాలవాడ : నాడు–నేడు రెండవ విడతలో భాగంగా మండలంలోని 17 పాఠశాలల్లో 29 పనులకు సంబంధించి ప్రభుత్వం రూ.6.25 కోట్లు వ్యయం చేస్తుందని అకడమిక్ మానిటరింగ్ అధికారిణి లలిత తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నాడు నేడు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా పాఠశాలల అకౌంట్లలో డబ్బులు జమ చేశారని పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆధునిక సదుపాయాల్లో భాగంగా ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టిందన్నారు. మండలంలోని పాఠశాలలకు ఐఎఫ్‌పీ ఇంటరాక్ట్ ప్లాట్ ప్యానల్ బోర్డు టీవీలు 42, స్మార్ట్ టీవీలు 18 మంజూరయ్యాయని చెప్పారు. ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, నాడు నేడు ఏఈ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సీఆర్పీలు లక్ష్మిదేవి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పుష్కలంగా ఎరువులు

దొర్నిపాడు: ఖరీఫ్ పంటల సాగులో భాగంగా రైతులకు ఇబ్బందులు లేకుండా ఆర్‌బీకేల్లో 110 మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులను అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి సునీత సోమవారం తెలిపారు. గుండుపాపలలో యూరియా 5, 20:20:0:13 రకం 6 మెట్రిక్ టన్నులు, డబ్ల్యూ గోవిందిన్నె డీఏపీ 10, డబ్ల్యూ.కొత్తపల్లెలో డీఏపీ 29, క్రిష్టిపాడులో డీఏపీ 24, బుర్రారెడ్డిపల్లెలో డీఏపీ 24, దొర్నిపాడు–1లో 12 మెట్రిక్ టన్నుల చొప్పున ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోని తీసుకవెళ్లాలని సూచించారు.

ఆటోను ఢీ కొట్టిన కారు

నంద్యాలటౌన్: చాబోలు గ్రామ సమీపంలో హైవేపై సోమవారం రాత్రి ఓ కారు ఆటోను ఢీ కొట్టింది. ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉంది. ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ కుటుంబం తిరుపతి నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా చాబోలు సర్కిల్ దగ్గర రాంగ్ రూట్‌లో వస్తున్న ఒక ఆటో యూ టర్న్ తీసుకుంది. వేగంగా వస్తున్న కారు యూ టర్న్ తీసుకున్న ఆటోను బలంగా ఢీ కొట్టడంతో ఆటోలో ఉన్న వారికి గాయాలయ్యాయి. ప్రమాదం జరగగానే ఆటో డ్రైవర్ పరారయ్యాడు. అటుగా చాబోలుకు వెళ్తున్న కొందరు యువకులు ప్రమాదాన్ని గుర్తించి 108 కు ఫోన్ చేసి క్షతగాత్రులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో సాహెరా(7), హసీన(10) పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.



గాయపడిన బాలిక సాహెరా

‘మధ్యాహ్నం’కు బడ్జెట్ పెంచాలి



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మధ్యాహ్న భోజనం పథకంలో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ప్రతి నెల 5వ తేదీలోపు ఇవ్వాలని, పథకానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, సహాయ కార్యదర్శిబాలవెంకట్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి గ్రేసమ్మ కోరారు. సోమవారం ఈ మేరకు డీఈఓ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సీఐటీయూ కార్యదర్శి భాస్కర్, భోజన కార్మికులు నాగేశ్వరమ్మ, రుక్మిణి పాల్గొన్నారు.

కళాశాలల్లో ‘మధ్యాహ్నం’ అమలు చేయాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ కోరారు. సోమవారం స్థానిక పద్మావతినగర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ఎయిడెడ్, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇవ్వాలని, కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు సైక్, సాజిత్, వినోద్, కిరణ్, నవీన్, రవి, నాయక్, గిరి, హరి, వంశీ పాల్గొన్నారు.

కొబ్బరి సాగుతో మూడేళ్లలో ఫలసాయం

నంద్యాల(అర్బన్): ఉపాధి హామీ పథకం కింద చేల గట్ల మీద సాగు చేసిన కొబ్బరి మొక్కలతో మూడేళ్లలో రైతులు ఫల సాయం పొందవచ్చని ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా అంబుడ్స్ పర్సన్ డాక్టర్ సురేంద్రకుమార్ తెలిపారు. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో కొబ్బరి మొక్కల పెంపకాన్ని ఏపీఓ శశికళారెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని చాపిరేవుల, పోలూరు, పాండురంగాపురం, బిల్లలాపురం గ్రామాల్లోని రైతులకు కొబ్బరి మొక్కలను అందజేశామని చెప్పారు. మొక్కల పెంపకానికి సంబంధించి మూడేళ్ల పని దినాలకు మస్టర్‌ను సంబంధిత రైతు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కొబ్బరి సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని చెప్పారు.

ముమ్మరంగా ఇళ్ల నిర్మాణాలు





యర్రగుంట్లలో పూర్తియిన ఇళ్లు, కోటపాడులో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు

లే అవుట్	మంజూరైన ఇళ్లు	నిర్మాణంలో ఉన్నవి
యర్రగుంట్ల	113	95
శిరివెళ్ల	337	185
బోయలకుంట	43	33
గంగవరం	51	45
గోవిందపల్లె	199	65
కోటపాడు	25	15
	768	438

శిరివెళ్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు, ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మండలంలో 2,345 మందికి స్థలాలు పంపిణీ చేసి గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, కోటపాడు, బోయలకుంట్ల, గంగవరం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆయా కాలనీలలో ప్రజలకు తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించారు. ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రూ.108.85 కోట్ల బిల్లులు అందజేసింది.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావచ్చాయి

మండలంలో పక్కా గృహాల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అత్యధికంగా యర్రగుంట్ల జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. స్థలం, ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం. లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్లు నిర్మించుకోక పోతే స్థలం రద్దు చేస్తామని కూడా చెబుతున్నాం. నిర్మాణాల దశల బట్టి బిల్లులు మంజూరవుతున్నాయి. ప్రభుత్వం జగనన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

– శేఖర్, హౌసింగ్ ఏఈ

సమస్యలు పరిష్కరించండి



భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ అందజేస్తున్న మహిళా రైతు

ఉయ్యాలవాడ : జగనన్న కాలనీలో నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు కోరారు. తమ భూ సమస్యలను పరిష్కరించాలంటూ వివిధ గ్రామాలకు చెందిన రైతులు అధికారులకు అర్జీలు సమర్పించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందనలో సమస్యలను పరిష్కరించాలని పలువురు అధికారులను అభ్యర్థించారు. స్థానిక జగనన్న లేఅవుట్ కాలనీలో 127 మందికి ప్రభుత్వం గృహాలు నిర్మించుకునేందుకు అనుమతులు మంజూరు చేయడంతో నిర్మాణం పనులు చేపట్టారు. అయితే నిర్మాణాలకు సంబంధించి నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరాగా.. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు స్పందిస్తూ పైప్ లైన్ పనులు రెండు రోజుల్లో పూర్తవుతాయని, సింథటిక్ ట్యాంక్ ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఆర్.జంబులదిన్నె, కాకరవాడ, హరివరం గ్రామాలకు చెందిన శ్రీహరిశంకర్‌రెడ్డి, భాగ్యమ్మ, అంబటి వీరనరసింహారెడ్డి, బైరెడ్డి వెంకటరామిరెడ్డి, కాటసాని బైపిరెడ్డితో పాటు పలువురు రైతులు తమకు సంబంధించిన భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, పక్క రైతుల పేరుతో చూపుతున్నాయని, పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ రవికుమార్ స్పందిస్తూ..క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, హౌసింగ్ ఏఈలు ఫణీత్‌కృష్ణ, గురప్ప, నరసింహారావు పాల్గొన్నారు.

పొలాన్ని ఆక్రమించారు..న్యాయం చేయండి

దొర్నిపాడు: సార్.. నాపేరు చక్రపాణి. ఉయ్యాలవాడ మండలం అర్.పాంపపల్లెలో నివాసం ఉంటున్నా. నాకు దొర్నిపాడు మండలం రామచంద్రాపురం గ్రామంలో తనకు 26 ఎకరాల పొలం ఉండేది. 2009లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. అనుకోని కారణాల వల్ల 15 ఏళ్లుగా ఊరు విడిచి వెళ్లాం. ఇప్పుడు పొలం సాగుచేసుకుందామని వెళ్తే..వేరే వాళ్లు పూర్తిగా ఆక్రమించికున్నారని, తనకు న్యాయం చేయాలని తహసీల్దార్ జయప్రసాద్‌కు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్.. విచారించి చర్యలు తీసుకోవాలని ఎంఆర్ఐ, వీఆర్ఓ, వీలేజ్ సర్వేయర్లు ఆదేశించారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఏఓ సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ పాల్గొన్నారు.

సంక్షిప్తం

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): డిప్యూటేషన్ గడువు ముగిసినా అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బాయికాటి బెనర్జీ మాదిగ, వెంకటసుబ్బన్న, కత్తి ఓబులేసు సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌కు పరిపాలన అనుభవం లేకపోవడంతో నంద్యాల అభివృద్ధి కుంటుపడిందని, దళితుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పురపాలక సంఘ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం స్థానిక సుంకులమ్మ పేట ప్రాథమిక పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ ఆత్మీయ సమావేశానికి ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ మహేంద్రారెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు లక్ష్మణ్, జానిబాషా, రామకృష్ణ, జక్రియ పాల్గొన్నారు.

లైన్‌మెన్‌పై దాడి–కేసు నమోదు

రుద్రవరం: మండలంలోని చిత్రేనిపల్లె గ్రామ విద్యుత్ లైన్‌మెన్ వెంకటయ్యపై అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ,లక్ష్మీశేఖర్ దాడి చేయడంతో వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. విద్యుత్ బకాయి బిల్లు చెల్లించాలని లైన్‌మెన్ కోరగా.. బిల్లు చెల్లించక పోవడంతో పాటు దాడికి పాల్పడ్డారని లైన్‌మెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఆలయాన్ని తొలగించొద్దు

నంద్యాల(అర్బన్): నందికొట్కూరు మండలం 10బొల్లవరం గ్రామంలో 800 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన వేణుగోపాల స్వామి ఆలయాన్ని హైవేలో తొలగించకుండా యథాతథ స్థితిలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

నంద్యాల(వ్యవసాయం): న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని, తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చి రక్షణ కల్పించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజయశేఖర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, రఘుప్రకాష్ కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది ఆదిశేషు విఠల్ బాబు హత్యను ఖండిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి సంతాపం ప్రకటించారు.

కారుణ్య నియామకం

ఉయ్యాలవాడ : చాగలమర్రి రెవెన్యూ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న కంబగిరి రాముడు అనారోగ్యంతో 2021 జనవరిలో మృతి చెందాడు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఆయన కుమార్తె చిన్నపుల్లమ్మకు ప్రభుత్వం అటెండర్ ఉద్యోగం కల్పించింది. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆమె విధుల్లో చేరినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దొర్నిపాడు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి నాగేంద్ర సూచించారు. సోమవారం మండలంలోని క్రిష్టిపాడు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి రోగులకు వైద్యపరీక్షలు చేశారు. గ్రామానికి చెందిన సన అనే పదేళ్ల చిన్నారికి ఏడాది క్రితం షుగర్ వచ్చిందని ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వ్యవసాయాన్ని మరవద్దు

ఉయ్యాలవాడ : రైతులు వ్యవసాయాన్ని మరిచిపోవద్దని, ప్రతి సంవత్సరం పంటలు సాగు చేయాలని సామాజికవేత్త మర్రిపల్లె అబ్దుల్ గఫార్ కోరారు. సోమవారం ఉయ్యాలవాడలో ఆటో ద్వారా ప్రచారం చేస్తూ రైతులకు అవగాహన కల్పించారు.

ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు కోరారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ రాత పూర్వకంగా చెప్పడం సిగ్గుచేటన్నారు. ఏసురత్నం, గౌస్, మస్తాన్‌వలి, రత్నమయ్య పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ఓబులేసు సోమవారం మోటార్ సైకిల్‌పై నుంచి కింద పడి తీవ్ర గా యాలపాలయ్యాడు. పొలం పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఆళ్లగడ్డలో పులి కలకలం

ఆళ్లగడ్డ: పట్టణంలోని సత్రం బజారులో పులి కలకలం రేపింది. తాము పులిని చూశామంటూ స్థానికులు కొందరు సోమవారం భయపడి ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోయారు. పట్టణ శివారులో వక్కిలేరు వాగు ఉండటంతో వచ్చి ఉండవచ్చని కొందరు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): పద్మావతినగర్ సొసైటీలో జరుగుతున్న అవినీతిని అరికట్టి సర్వే నంబర్703, 704లో ఉన్న స్థలాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు కలెక్టర్‌ను కోరారు.